సాక్షి ఒడిశా

ఆదివారం | 29 | జూన్ | 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 6,17,895
బంగారం	1 గ్రాము
వెండి	47 గ్రాముల 500 మిల్లీ
గ్రాములు	- భువనేశ్వర్/పూరీ



చిలికా సరస్సులో..

చిలికా సరస్సులో జగన్నాథుని రథయాత్ర జరిగింది. ఏటా ఇక్కడ యాత్ర జరుగుతుంది.

- 8లో



రోడ్డుపై చేపలు పడుతూ..

రోడ్డు బాగోలేదని వినూత్నంగా చెప్పారు. గోతుల్లో చేపలు పట్టి నిరసన తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

మత్స్యావతారంలో జగన్నాథుడు



మత్స్యావతారంలో జగన్నాథుడు

రాయగడ: రథ యాత్రలో భాగంగా గుండిచా మందిరంలో కొలువుదీరిన దేవతామూర్తులు జగన్నాథ ,బలభద్ర, సుభద్రలు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నాడు మత్స్యావతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చాడు.

భారీ వర్షంతో నిలిచిన రథాలు



గుండిచా మందిరానికి చేరిన రథం

జయపురం: పూర్వకాలం నుంచి వస్తున్న ఆచారం ప్రకారం ఒకరోజు ఆలస్యంగా జయపురంలో శనివారం రథయాత్ర ప్రారంభమైంది. అయితే రథాలు వెల్కం జంక్షన్ వద్దకు చేరుకునే సమయానికి భారీగా వర్షం కురవడంతో అక్కడే నిలిచిపోయాయి. అనంతరం సాయంత్రం 6 గంటల సమయంలో వర్షం తగ్గడంతో మరలా రథాలు పయనం సాగించి గుండిచా మందిరానికి చేరాయి. యాత్రంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ దుర్మరణం



ప్రియాంక మృతదేహం

జయపురం: కూరగాయల తోటలో విద్యుత్ షాక్‌తో మహిళ దుర్మరణం పాలైన ఘటన జయపురం సదర్ పోలీసుస్టేషన్ పరిధి గొడాపాదర్ ప్రాంతంలోని ఏకతాగుడ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఏకతాగుడ గ్రామంలో విద్యుత్ మండల్ తన కాయగూరల పంటను పశువుల నుంచి రక్షించుకునేందుకు కంచె వేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. అయితే అతడి భార్య ప్రియాంక మండల్ తోటకు వెళ్లింది. ఆ సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ ప్రసారం కావడంతో ప్రియాంక విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయింది. వెంటనే ఆమెను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందడంతో సదర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు.

గర్భిణికి డోలీ కష్టాలు!

- డోలీలో ఐదు కిలో మీటర్లు మోసుకొచ్చిన కుటుంబ సభ్యులు



రైలీ ముదలిని డోలీలో తరలిస్తున్న దృశ్యం

కొరాపుట్: గర్భిణిని డోలీలో ఐదు కిలో మీటర్లు తరలించిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. కొరాపుట్ జిల్లా జయపూర్ సబ్ డివిజన్ కెబిడి గ్రామ పంచాయతీ కుసుంబోట గ్రామానికి చెందిన త్రినాథ్ ముదలి భార్య రైలీ ముదలికి శనివారం పురిటి నొప్పులు వచ్చాయి. ఆ గ్రామానికి రోడ్డు సదుపాయం లేదు. దీంతో మంచాన్ని డోలీగా చేసుకొని గిరిజనులు ఐదు కిలో మీటర్లు తరలించారు. మార్గమధ్యలో భారీ వర్షంతో పాటు కొండలు, గుట్టలు, అడవులు, నదులు దాటి ఆస్పత్రికి మోసుకొని వచ్చారు. అనంతర ప్రభుత్వ ఆస్పత్రిలో ఆడ బిడ్డకి రైలీ ముదలి జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు ప్రకటించారు.

శ్రీ గుండిచా చేరిన రథాలు

- నేడు అడపా మండపానికి తరలింపు



రథం లాగుతున్న ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి, డీజీపీ



శ్రీ గుండిచా ఆవరణలో మూడు రథాలు



సుభద్ర రథం దర్ప దళనం లాగుతున్న మహిళా పోలీసు సిబ్బంది

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుని రథయాత్ర రెండో రోజుతో పూర్తయ్యింది. శనివారం మధ్యాహ్నం వేళకు మూడు రథాలు యాత్ర తొలి ఘట్టంలో భాగంగా శ్రీ గుండిచా మందిరం ఆవరణకు చేరాయి. తొలి రోజు అవాంతరాలతో మర్నాడు శనివారం ఉదయం 9.45 గంటలకు రథాలు లాగడం పునఃప్రారంభించారు. శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణ నుంచి బయల్దేరిన క్రమంలో మూడు రథాలు శ్రీ గుండిచా ఆవరణకు చేరాయి. తొలుత బయల్దేరిన బలభద్రుని తాళ ధ్వజం మొదట చేరింది. వెంబడి దేవీ సుభద్ర దర్ప దళనం చేరిన తర్వాత చివరగా శ్రీ జగన్నాథుని నంది ఘోష్ చేరింది. రథాలపై దేవుళ్లను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. శుక్రవారం రాత్రి నుంచి నడి రోడ్డు మీద రథాలపై మూల విరాట్లకు సకల సేవలు అందజేస్తున్నారు. అడపా మండపానికి చేరేంత వరకు శ్రీ గుండిచా ఆవరణలో రథాలపై సేవలు నిరవధికంగా కొనసాగిస్తారు. ఆదివారం మధ్యాహ్నం చతుర్ధా మూర్తుల్ని రథాలపైనుంచి వరుస క్రమంలో మూల విరాట్లుల్ని దించి అడపా మండపానికి చేర్చుతారు. సాయంత్రం నుంచి అడపా మండపంపై భక్తులకు పవిత్ర దర్శనం లభిస్తుంది. అడపా మండపంపై దర్శనం అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ మండపంపై ఒకసారి దర్శించుకుంటే శ్రీ మందిరం రత్న వేదికపై 10 సార్లు చేసిన ఫలితం ప్రాప్తిస్తుందని నమ్ముతారు. మూల విరాట్లు 7 రోజుల పాటు గుండిచా ఆలయం అడపా మండపంపై కొలువు దీరి పూజలు అందుకుంటారు. ఈ సమయంలో పవిత్ర దర్శనంతో అడపా ఒబొధా (అన్న మహా ప్రసాదం) లభిస్తుంది.

రథాలపైనే దైనందిన ఉపచారాలు

భువనేశ్వర్: శ్రీ గుండిచా ఆవరణకు చేరిన రథాలపై మూల విరాట్లకు దైనందిన సేవలు నిర్వహిస్తున్నారు. మేలు కొలుపు నుంచి ఏకాంత సేవ వరకు సేవల్ని క్రమ పద్ధతిలో కొనసాగిస్తున్నారు. మరో వైపు రథాలపై దేవుళ్లని భక్తులు నిరవధికంగా దర్శించుకుంటున్నారు. అడపా మండపం చేరేంత వరకు ఇదే శైలి కొనసాగుతుంది.



నంది ఘోష్ రథంపై శ్రీ జగన్నాథునికి బింబ స్నానం



శ్రీ జగన్నాథునికి స్నాన అనంతరం వస్త్ర ధారణ

రథం లాగిన అధికారులు

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుని యాత్ర రెండో రోజుకి వాయిదా పడడంతో శ్రద్ధా భక్తులు కలిగిన వారికి అదనపు అవకాశంగా మారింది. తొలి రోజున ప్రముఖుల సేవలు, యాత్ర నిర్వహణ కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నమై లాంఛనంగా నమస్కరించి సర్దుకు పోయిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది శనివారం శ్రీ జగన్నాథుని నంది ఘోష్ రథం లాగి తన్మయులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, పోలీసు డైరెక్టరు జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా వంటి ప్రభుత్వ ఉన్నతాధికారులతో శ్రీ మందిరం సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితర వర్గాలు ఆనందోత్సాహాలతో రథాల్ని లాగి తరించారు.



తాళ ధ్వజంపై బలభద్ర స్వామికి దివ్య మంగళ హారతి

కళారాధన

భువనేశ్వర్: పూరీ రథయాత్రలో శ్రీ మందిరం నుంచి శ్రీ గుండిచా వరకు సుమారు 3 కిలో మీటర్ల పొడవున కళారాధన జరిగింది. అభినయం, నృత్యం, సంకీర్తన, గీతాలాపనలు ఆకట్టుకున్నాయి.



పురి విప్పిన మయూరి నృత్య భంగిమలో కళా ప్రదర్శన



శివయ్య ఆనంద హేళ



నల్లనయ్య అభినయంతో మురిపించిన చిన్నారి



వీరాంజనేయ వేష ధారణలో జై జగన్నాథ్ నినాదంతో గంతులేసిన వేషధారి



దర్ప దళనంపై దేవీ సుభద్ర దర్శనం

కొరియాలో అంగరంగ వైభవంగా రథయాత్ర



కొరియా కొండ మీద రాష్ట్ర మంత్రులు కనక వర్ధన్ తదితరులు



కొరియాలో జగన్నాథ దేవాలయాన్ని మంత్రులకు చూపిస్తున్న కలెక్టర్ వి.కీర్తి వాసన్



రథం లాగుతున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క

కొరాపుట్: ఆంధ్ర–ఒడిశా వివాదాస్పద ప్రాంతంలో అంగరంగ వైభవంగా రథయాత్ర జరిగింది. శనివారం రాష్ట్ర మంత్రి వర్గం భారీగా తరలివచ్చింది. ఈ ప్రాంతం తమదేనని పరోక్షంగా ఆంధ్రాకు సంకేతాలు పంపించింది. ఉదయం ప్రత్యేక విమానంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, రాష్ట్ర గనుల మంత్రి బిభూతి భూషణ్ జెన్నా, రెవెన్యూ మంత్రి సురేష్ పూజారి, మత్స్య శాఖ మంత్రి గోకులా నంద నాయక్ జయపూర్‌లో దిగారు. వీరికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండో స్వాగతం పలికారు. అనంతరం మంత్రుల బృందం కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కొరియా గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న జగన్నాథ దేవాలయాన్ని సందర్శించారు. స్థానిక గిరిజనులతో కలసి రథం మీదకు ఎక్కి పూజలు చేశారు. రథాన్ని లాగుతూ యాత్ర కొనసాగించారు. ఇంత వరకు చరిత్రలో ఏనాడూ ఈ స్థాయిలో అధికార యంత్రాంగం కొరియా రాలేదు. ఈ సారి పార్టీలకు అతీతంగా నాయకులు వచ్చారు. బీజేపీకి చెందిన నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి, కాంగ్రెస్‌కు చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క జత కలిశారు. సీఎల్పీ నాయకుడు రాం చంద్ర ఖడం, ఎమ్మెల్యేలు తారా ప్రసాద్ బాహిణీపతి (జయపూర్), రుపుధర్ బోత్ర(కొట్‌పాడ్), రఘురాం మచ్చో(కొరాపుట్) ఐక్యంగా కొరియా కోసం సంఘీబావ ప్రకటనలు చేశారు. కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, అనేక మంది మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు ఈ యాత్రలో పాల్గొన్నారు. కొరియా పరిధిలో 22 గ్రామాల ప్రజలు ఈ యాత్ర లో పాల్గొన్నారు. పోలీసులు భారీగా మోహరించారు.

డీజీపీ పర్యవేక్షణ

భువనేశ్వర్: తొలి రోజు నిలిచిపోయిన యాత్రని విజయవంతంగా పూర్తి చేసేందుకు శనివారం తెల్లవారున రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో నిలిచిన నంది ఘోష్ రథంపై శ్రీ జగన్నాథుని ప్రార్థించారు. అనంతరం మిగిలిన యాత్ర నిరాటంకంగా పూర్తి చేసేందుకు సమగ్ర పోలీసు వ్యవస్థని ప్రత్యక్షంగా సమీక్షించారు.



శ్రీ జగన్నాథుని ప్రార్థనలో డీజీపీ

కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం



కల్తీ ఆహార పదార్థాలను పారవేస్తున్న దృశ్యం



పాడైన పదార్థాలు డ్రైనేజీలో పార బోస్తున్న దృశ్యం



తనిఖీలు చేస్తున్న సిబ్బంది

కొరాపుట్: కల్తీ ఆహార పదార్థా విక్రయాలపై అధికారులు ఉక్కు పాదం మొపారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారి అరుణ్ కుమార్ మహారణ నేతృత్వంలోని బృందం శనివారం పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. మెయిన్ రోడ్డులో స్వీట్స్ షాప్స్, రోడ్డు పక్కన విక్రయించే చిరు తిళ్ల దుకాణాల్లో సోదాలు జరిపారు. సుమారు 80 కేజీల కల్తీ ఆహారాలను గుర్తించి డ్రైనేజీల్లో పార వేశారు. ఆహారంలో రంగులు కలిపి విక్రయించవద్దని వ్యాపారులను హెచ్చరించారు. జగన్నాథ రథా యత్ర నేపథ్యంలో రోజూ గ్రామీణ ప్రాంతాల నుంచి గిరిజనులు నబరంగ్‌పూర్ వచ్చి తిను బండారాలు కొనుగోళ్లు చేస్తారు. ఇటువంటి ఆహారాన్ని కొనుగోలు చేసి తింటే వ్యాధులు ప్రబలుతాయని అధికారులు పేర్కొన్నారు.

రోడ్డుపై ధాన్యం పోసి రైతుల ఆందోళన



రైతులతో చర్చలు జరుపుతున్న పోలీసులు



రోడ్లపై ధాన్యం పోసి నిరసన తెలుపుతున్న రైతులు

కొరాపుట్: రోడ్డుపై ధాన్యం పోసి రైతులు ఆందోళనకు దిగారు. శనివారం కొరాపుట్ జిల్లా జయపూర్ సబ్ డివిజన్ కొట్‌పాడ్ సమితిలో జాతీయ రహదారిపై రైతులు ధాన్యం పోసి నిరసన తెలిపారు. ఈ ప్రాంతంలోని దుంగ్రి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివాదం కొనసాగుతోంది. ఇక్కడ సుమారు 600 మంది రైతులకు చెందిన సుమారు 10 వేల క్వింటాళ్ల ధాన్యం ఉంది. వాటిని కొనుగోలు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. కాల పరిమితి తీరి పోతున్నందున ధాన్యం కొనుగోలు చేయాలని పలు మార్లు రైతులు విజ్ఞప్తి చేశారు. చివరకు జయపూర్‌లో సబ్ డివిజన్ కార్యాలయాలకు వినతి పత్రాలు సమర్పించారు. రథయాత్ర తర్వాల రోడ్ల పైకి దిగుతామని ముందే హెచ్చరించారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోతోంది. దీంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ధాన్యం రోడ్లపై వేసి ఆందోళనకు దిగారు.

కన్నీటి వీడ్కోలు!



పక్కపక్కనే మూడు మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న దృశ్యం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ్ బొత్ర

- ఒకే కుటుంబానికి చెందిన మూడు మృతదేహాలకు ఒకేసారి దహన సంస్కారాలు

కొరాపుట్: ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరికి ఒకే చోట దహన సంస్కారాలు శనివారం నిర్వహించారు. చితిమంటలు ఎగసి పడుతుంటే కుటుంబ సభ్యులు కన్నీట పర్యంతమయ్యారు. వివరాల్లోకి వెళితే.. నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం గ్రామానికి చెందిన చంపక్ లాల్ జైన్ కుమారుడు సాగర్ జైన్ (21), మహావీర్ జైన్ కుమారుడు అంకుర్ జైన్ (18), మన్ మోహన్ జైన్ కుమారుడు క్రిష్ జైన్ (22) కారు ప్రమాదంలో శుక్రవారం వేకువజామున మృతి చెందారు. వీరి మృతదేహాలను జొరిగాం పోలీసులు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతులందరు తమ తండ్రులకు ఒకే మగ సంతానం. అంతేకాక ఇద్దరు తండ్రులు అన్నదమ్ములు, మరో మృతుడు కూడా ఇదే కుటుంబానికి చెందిన వ్యక్తే. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకుంది. దీంతో ముగ్గురు మృతదేహాలకు శనివారం జొరిగాం గ్రామంలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. జొరిగాం ఎమ్మెల్యే నర్సింగ్ బోత్ర బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ముగ్గురు మృతికి సంతాపంగా జొరిగాంలో వర్తక వాణిజ్య సంస్థలను మూసివేశారు.



విషాదంలో బాధిత కుటుంబం

క్లుప్తంగా

రహదారి సౌకర్యం కల్పించండి



గ్రామానికి వెళ్లే రహదారి

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి పరిధి గడ్డి శశిఖాల్ పంచాయతీ మోండొలోపితేసు గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలం కావడంతో గ్రామానికి ఉన్నటువంటి మట్టిరోడ్డుపై కనీసం నడిచే అవకాశం కూడా లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

హనుమాన్ చాలీసా పుస్తకాలు పంపిణీ



గొడుగులు, పుస్తకాలతో గ్రామస్తులు

రాయగడ: సదరు సమితి దిసారిగుడ గ్రామంలో ఆధ్యాత్మికంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు హనుమాన్ చాలీసా పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. ఆధ్యాత్మికురాలు జయంతి సెఠి సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. మన సనాతన ధర్మాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు తెలుసుకునేవిధంగా తమ వంతు కృషి చేస్తున్నట్లు ఆమె చెప్పారు. అదేవిధంగా గ్రామంలో చదువుతున్న విద్యార్థులకు గొడుగులను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్య మెలక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై చేపలు పడుతూ నిరసన



రహదారిలో చేపలు పడుతున్న గ్రామస్తులు

మల్కన్‌గిరి: దారి అధ్వానంగా ఉందని చెప్పినా ఏమీ చేయకపోవడంతో ఆ గ్రామస్తులు రోడ్డుపై చేపలు పట్టి వినూత్నంగా నిరసన తెలిపారు. నగరంలో 19 వ వార్డులో గల రిక్లమేషన్ చౌక్ నుంచి ఎంవీ 43 గ్రామం వరకు దాదాపు 3 కిలోమీటర్ల దారి పూర్తిగా ధ్వంసమైపోయింది. రహదారి మధ్యలో 2 నుంచి 3 అడుగుల లోతైన గుంతలు పడి ఉండడంతో స్థానికులు శనివారం అందులో చేపలు పట్టి నిరసన తెలిపారు.

ఆహార పానీయాలు పంపిణీ



ప్రయాణికులకు ఆహార పానీయాలు పంపిణీ చేస్తున్న రైల్వే సిబ్బంది

భువనేశ్వర్: సుదూర ప్రాంతాల నుంచి శ్రీ జగన్నాథుని రథ యాత్ర సందర్శనకు విచ్చేసే రైలు ప్రయాణికుల కోసం ఖుర్దారోడ్ రైల్వే స్టేషన్‌లో ఉచిత ఆహార పానీయ వితరణ కేంద్రం నిర్వహించారు. స్థానిక బాలాజీ మందిరం కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. రథ యాత్రను పురస్కరించుకుని రైల్వే శాఖ పూరీ ప్రాంతానికి ప్రత్యేక రైళ్లు నడిపించడంతో రద్దీ అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో స్వచ్ఛందంగా సేవలను అందిస్తున్నారు.

పాముకాటుకు చిన్నారి మృతి

కంచిలి: మకరాంపురం గ్రామానికి చెందిన గుడియా సాయిసా(10) అనే చిన్నారి పాము కాటుకు గురై మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. గుడియా పూర్ణచంద్ర–గీత దంపతుల కుమార్తె సాయిసా కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా పాము కాటేసింది. చిన్నారిని కుటుంబ సభ్యులు వెంటనే సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బరంపురం ఎం.కె.సి.జి. ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందింది. సాయిసా స్థానిక ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. తండ్రి పూర్ణచంద్ర టిఫిన్ హోటల్‌లో హెల్పర్‌గా, తల్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్నారి సాయిసాతోపాటు కుమారుడు ఉన్నాడు. కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు సిక్కోలు క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మొదటి జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్–2025 పోటీలకు జిల్లాకు చెందిన సత్తారు రామ్మోహనరావు, పోతనపల్లి యమున ఎంపికయ్యారు. ఈ పోటీలు జూన్ 29 నుంచి జూలై ఒకటో తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ వేదికగా జరగనున్నాయి. ఇప్పటికే వీరు ఏపీ జట్లతో కలిసి హరిద్వార్ చేరుకున్నారు.

చిలికా సరస్సులో ..
జగన్నాథుని రథయాత్ర

భువనేశ్వర్: ఏటా శ్రీ క్షేత్రంలో రథ యాత్ర జరిగే రోజున చిలికా సరసులో స్వామి రథ యాత్ర నిర్విఘ్నంగా కొనసాగుతోంది. ఏటా చిలికా సరస్సు జలాలపై స్వామి యాత్ర జరుగుతుంది. శతాబ్దాలుగా ఈ యాత్ర నిరవధికంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఖుర్దా జిల్లా చిలికా సరస్సులో సుందరమైన కొంకొణొ శిఖారి ద్వీపం జగన్నాథుని జల రథ యాత్ర స్థలం. చిలికా సరసు జలాలపై స్వామి రథ యాత్ర ఉత్కంఠభరితంగా కొనసాగుతుంది. స్వామి యాత్రతో నిశ్చలమైన చిలికా సరసు కొంకొణొ శిఖారి ద్వీపం పరిసరాలు మేళ తాళాలు, మృదంగం, ఘంటానాదంతో మారు మోగడంతో ఆధ్యాత్మిక వాతావరణం అలముకుంటుంది. బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి పడవ రథంపై చిలికా సరసు నీలి జలాల మీదుగా యాత్ర నిర్వహించడం ప్రత్యేక అనుభూతిని మిగుల్చుతుంది. యాత్ర పడవ రథం ఆకర్షణీయంగా రూపుదిద్దుకుని కొంకొణొ శిఖారి ద్వీపం చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో స్వామి యాత్ర ముగుస్తుంది.



పడవ రథంపై చిలికా సరసులో శ్రీ జగన్నాథుని రథ యాత్ర

దాడులు ప్రభావం

ఈ విభిన్నమైన రథ యాత్ర చరిత్ర పుటల్లో చోటు చేసుకుంది. పూరీలోని శ్రీ జగన్నాథ ఆలయంపై గతంలో 18 సార్లు దాడులు జరిగినట్లు సమాచారం. ఆయా సందర్భాల్లో రక్షణ కోసం దేవతా మూర్తులను చిలికా సరస్సులోని నొయిరి ఘాట్ కొంకొణొ శిఖారీ ద్వీపానికి 2 సార్లు తరలించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. 1731లో ముస్లిం పాలకుడు తాకీ ఖాన్ పూరీలోని శ్రీ మందిరంపై దాడి చేసి ఆక్రమించినప్పుడు భద్రంగా పదిలపరిచేందుకు రత్న వేదికపై మూల విరాట్లు శ్రీ జగన్నాథుడు, బలభద్ర స్వామి, దేవీ సుభద్రతో చక్రరాజు సుదర్శనుని రహస్యంగా చిలికా సరసుకు తరలించారు. ఈ ప్రాంతం దట్టమైన అడవులుతో కూడుకొని ఉండడంతో సురక్షితంగా భావించి దేవుళ్లని ఇక్కడకు తరలించారు. ఈ అటవీ ప్రాంతంలో కొంకొణి అనే పండ్లు మినహా ఇతర పదార్థాలు లభ్యం కానందున వీటినే నిత్యం నైవేద్యంగా సమర్పించి ఆరాధించి రక్షణ కల్పించారు. ఈ చర్యతో స్వామి నెలకొన్న ద్వీపం కొంకొణొ శిఖారి ద్వీపంగా భాసిల్లుతుంది. అది మొదలుకొని ఈ ద్వీపంలో శ్రీ జగన్నాథుని పూజాదులు ఆచారం ప్రకారం నిర్వహిస్తున్నారు.



కొంకొణొ శిఖారి ద్వీపం ప్రదక్షిణలో శ్రీ జగన్నాథుని పడవ రథం

సందర్శకులకు సదుపాయాలు

చిలికా సరసులో స్వామి రథ యాత్ర ప్రత్యక్షంగా తిలకించేందుకు భక్తులు తరలి వస్తారు. వీరంతా తీరానికి పరిమితం కాకుండా సరసులో యాత్ర పడవతో తిరుగాడేందుకు పడవ సౌకర్యం కల్పిస్తారు. ఈ సందర్భంగా నొయిరీ ఘాట్ నుంచి కొంకొణొ శిఖారి ద్వీపం వరకు భక్తులను తీసుకెళ్లడానికి ఉచిత పడవలు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక పోలీసు యంత్రాంగం యాత్ర సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేస్తుంది. కొంకొణొ శిఖారీ ట్రస్ట్ భక్తుల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ఉచిత రవాణాతో ప్రసాద వితరణ చేసింది. మహా ప్రభువు రథ యాత్ర భక్తులు, భగవంతుని అద్వితీయ కలయికకు ఈ యాత్ర నిలువెత్తు తార్కాణం.

ప్రభుత్వంపై విమర్శల వాన

భువనేశ్వర్: పూరీ రథయాత్రలో ప్రభుత్వం విఫలమైందని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ప్రభుత్వ తీరుపై విపక్ష బిజూ జనతా దళ్ ఇతర రాజకీయ పక్షాలు విరుచుకు పడుతున్నాయి. మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం తొలి సారిగా గత ఏడాది రథ యాత్ర నిర్వహించింది. ఎన్నడూ లేని విధంగా అడపా విజే పొహండి సమయంలో బలభద్రుని మూల విరాటు బోర్లా పడింది. ఈ సంఘటనపై విచారణ బృందం దర్యాప్తు నివేదికను బహిర్గతం కాలేదు. ఎవరి పట్ల ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ ఏడాది యాత్ర ఆద్యంతాలు తప్పిదాలు చోటు చేసుకుని భక్త జనాన్ని కలవర పరుస్తున్నాయి. యాత్ర ముగిసే లోగా మరెన్ని ఇలాంటి అపచారాల్ని చవి చూడాల్సి వస్తుందోననే భయాందోళనలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఈసారి ఒణొసారొ సమయంలో స్వామి చికిత్స కోసం పంపిణీ చేసిన దశ మూలిక మోదకాల చోరీ సంఘటన తీవ్ర కలకలం రేపింది. శుక్రవారం జరిగిన రథ యాత్రలో శ్రీ జగన్నాథుని రథం కదల లేదు. సాధారణంగా సూర్య అస్తమయం తర్వాత రథాలు కదిలే ఆచారం లేనట్లు ప్రచారంలో ఉండగా ఈ ఏడాది రథాలు చీకటి పడిన తర్వాత లాగడంతో సర్వత్రా విచారం వ్యక్తం అవుతుంది. ఆచారం అతిక్రమించిన సింహ ద్వారం ఆవరణ నుంచి శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథం కదల లేదు. మొత్తం మీద 3 రథాలు శ్రీ గుండిచా ఆలయం ఆవరణకు చేరలేదు. సాధారణంగా ముందు బయల్దేరిన బలభద్ర స్వామి తాళ ధ్వజం నిర్ధారిత సమయానికి శ్రీ గుండిచా గమ్యం చేరుతుంది. చేరువలో సుభద్ర రథం దర్ప దళనం ఆగుతుంది. ఈ ఏడాది ఏ ఒక్క రథం కూడ గమ్యం చేరక పోవడం విచారకరం. ఇటీవల కాలంలో ఇలాంటి సంఘటన దాఖలాలు లేనట్లు భావిస్తున్నారు. యాత్రలో రద్దీ నియంత్రణ లోపంతో పలువురు తొక్కిసలాటలో గాయపడ్డారు. పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యంతో ఈ తప్పిదం జరిగినట్లు ఆరోపణ. కార్డన్ పాసుల పంపిణీ వ్యవహారంలో మంత్రుల అక్రమాలతో తొక్కిసలాట జరిగిందనే విమర్శలు వ్యాప్తిలో ఉన్నాయి. సమగ్ర సంఘటనపై ఆత్మపరిశీలన చేసుకోవాలని విపక్ష నేత నవీన్ పట్నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

హిరమండలం: అప్పుల బాధ తట్టుకోలేక తంప గ్రామానికి చెందిన డోల దొరబాబు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను ధనుపురం గ్రామ సమీపంలో స్పైసీ దాబా నిర్వహించేవాడు. ఈ క్రమంలో ఐదేళ్ల కిందట వ్యాపారం కోసం అప్పులు చేశాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దొరబాబుకు భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. తండ్రి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహ్మద్ యాసిన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వజ్రపుకొత్తూరు : కొండవూరు గ్రామానికి చెందిన కొరికాన చైతన్య(29) అనే యువకుడు శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో పూండి నుంచి పలాస బైక్‌పై వెళుతుండగా బెండిగేటు సాయిబాబా గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. చైతన్య సీమేన్‌గా పనిచేస్తున్నాడు. తమ్ముడు హరీష్తో కలసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. తల్లితండ్రులు గున్నయ్య, అమ్మన్నలు ఏడేళ్ల క్రితమే చనిపోయారు. చైతన్యకు జూలై 31న వివాహం జరగాల్సి ఉంది. ఇంతలోనే మృతిచెందడంతో విషాదఛాయలు అలముకున్నా యి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఏఎస్ఐ రమణా రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు



ఘటనా స్థలంలో ఉన్న ద్విచక్ర వాహనం, కారు

● ఒకే కుటుంబంలో ముగ్గురికి గాయాలు

కంచిలి: కంచిలిలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గాయటపడ్డారు. వివరాల్లోకి వెళితే.. బొగాబెణి పంచాయతీ జెన్నాగాయి గ్రామానికి చెందిన దుర్యోధన జెన్నా భార్య తులసి జెన్నా, మూడేళ్ల కుమారుడు ఢిల్లేశ్ జెన్నాలతో కలిసి బైక్‌పై కంచిలి బజారుకు బయలుదేరాడు. అదే సమయంలో పలాస వైపు నుంచి ఇచ్ఛాపురం వైపు వెళుతున్న కారు అతివేగంతో వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కాలువలోకి ద్విచక్ర వాహనంతో సహా సుమారు వంద మీటర్లు ఈడ్చుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భర్త, భార్య, బిడ్డలు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిని 108 అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కారు కవిటి మండలం ఇంటెనకపుట్టుగ గ్రామానికి చెందినదిగా స్థానికులు చెబుతున్నారు. కారు ను నిర్లక్ష్యంగా నడపటం వల్లే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.



తీవ్రగాయాలపాలైన దుర్యోధన జెన్నా

గాయపడిన దుర్యోధన జెన్నా గొల్లకంచిలి గ్రామంలో నిమ్మాసినమ్మ ఆలయ పూజారిగా పనిచేస్తున్నారు. పూజా సామగ్రి కొనుగోలుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కంచిలి ఏఎస్ఐ పి.అప్పి రెడ్డి కేసు నమోదు చేశారు.

శ్రీముఖలింగంలో ఇకపై ఆన్‌లైన్ టికెట్లు

జలుమూరు: శ్రీముఖలింగంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇక నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయించనున్నట్లు దేవస్థాన ఇన్‌స్పెక్టర్ డి.ప్రసాద బాబు తెలిపారు. ఆయన శనివారం శ్రీముఖలింగం కార్యాలయంలో ఈఓ పి.ప్రభాకరరావుతోపాటు ఫిర్యాదుదారుడు నాయుడుగారి రాజశేఖర్‌ను కలిసి విచారించి అనంతరం పలు అంశాలను వివరించారు. శ్రీముఖలింగంలో అన్నదానం పేరిట భక్తులు నుంచి విరాళాలు సేకరిస్తున్నారని గ్రామానికి చెందిన ఎస్.రాజశేఖర్ ఇటీవల స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ నేపథ్యంలో దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. శ్రీముఖలింగంలో ఎలాంటి అన్నదానం నిర్వహించడం లేదని, భక్తులు ఇతర సేవలకు విరాళాలు అందిస్తే వాటికి తగు రశీదులు కార్యనిర్వాహక అధికారి నుంచి పొందాలని ఆయన సూచించారు.

ఏయూకి జయపూర్ రాజా రు. లక్ష విరాళం



వర్సిటీ పాలక వర్గానికి లక్ష రూపాయలు అందజేస్తున్న చంద్ర చుడ్ దేవ్

కొరాపుట్: జయపూర్ మహారాజా 4వ విక్రం దేవ్ వర్మ 156వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఉన్న ఆంధ్రా యూనివర్సిటీ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ విభాగంలో ఉన్న జయపూర్ విక్రం దేవ్ సెన్స్ అండ్ టెన్నాలజీ భవనం ముందు ఉన్న విక్రం దేవ్ వర్మ విగ్రహానికి నివాళులు అర్పించారు. జయపూర్ రాజ వంశపు ప్రస్తుత వారసుడు, ప్రస్తుత మహారాజు విశ్వేశ్వర్ చంద్ర చుడ్ దేవ్ హాజరై విక్రం దేవ్ విగ్రహానికి పూల మాలలు వేశారు. సుమారు శతాబ్దం తర్వాత జయపూర్ నుంచి రాజా ఆంధ్రా యూనివర్సిటీకి వెళ్లారు. ఏయూ నిర్మాణ సమయంలో నాటి రాజా విక్రం దేవ్ వర్మ చాలా ఆర్థిక సహాయం చేశారు. 1926 వరకు ప్రతి ఏడాది రూ. లక్ష చొప్పున ఆక్కడి విద్యార్థుల స్కాలర్ షిప్ కోసం పంపించేవారు. అప్పట్లో రూ. లక్ష విరాళానికి బ్రిటిష్ వారు కూడా ఆశ్చర్య పోయారు. విక్రం దేవ్ చేసిన సహాయానికి గుర్తుగా ఏయూలో విక్రందేవ్ విగ్రహం ప్రతిష్టించారు. ఒక విభాగానికి నేటికీ అతని పేరు కొనసాగిస్తున్నారు. వారి వారసుడు చంద్ర చుడ్ దేవ్ తమ వంశీయుల పేరు ప్రతిష్టలు కాపాడడానికి నడుం బిగించారు. ఇందులో భాగంగా ఏయూకి లక్ష రూపాయల విరాళాన్ని శనివారం వర్సిటీ పాలకవర్గానికి అందజేశారు. మహారాజ ఆఫ్ కళింగ్ చారిటబుల్ ఫౌండేషన్ తరఫున ఇకపై ప్రతి ఏటా ఏయూకి లక్ష రూపాయలు ఇవ్వనున్నట్లు ప్రకటించారు.



విక్రం దేవ్ వర్మ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జయపూర్ రాజా చంద్ర చుడ్ దేవ్

ఘనంగా విక్రమదేవ్ వర్మ జయంతి



విక్రమదేవ్ వర్మ చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి

జయపురం: జయపురం మహారాజు రాజర్షి స్వర్గీయ విక్రమదేవ్ వర్మ 157వ జయంతిని జయపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌ఆర్ మాల్ సభాగృహంలో జయపురం సాహిత్య పరిషత్, ఒడిశా రాష్ట్ర సాహిత్య అకాడమీలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విక్రమదేవ్ వర్మ చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి జయంతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జయపురం సాహితీ పరిషత్ అధ్యక్షులు హరిహర కరసుధా పట్నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఒడిశా సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ సురేంద్ర నాథ్ దాస్ ముఖ్యవక్తగా పాల్గొని సామ్రాట్ విక్రమ దేవ్ సాహితీ రంగానికి అందించిన సేవలు వివరించారు. సమావేశంలో గాయిత్రీ పాణిగ్రాహి రచించిన స్మృతి పకుడ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సాహితీవేత్త బంగాళీ నందోను విక్రమ దేవ్ సమ్మాన్ 2025 తోను, ప్రొఫెసర్ సత్యనారాయణ రథ్‌ను, జయపురం సాహిత్య పరిషత్ సమ్మాన్‌తోను సన్మానించారు. కార్యక్రమంలో కొరాపుట్ కోట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ రథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పరేష్ రథ్, సాహిత్య పరిశోధకులు శ్రీరంగ నాయిక్, జయపురం సాహిత్య పరిషత్ కార్యదర్శి నిరంజన్ పాణిగ్రాహి, పలువురు రచయితలు, సాహిత్యకులు పాల్గొన్నారు.



విక్రమదేవ్ జయంతి సభలో పాల్గొన్న ప్రముఖులు

బాక్సింగ్‌లో మెరిసిన సత్య భార్గవ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన జి.సత్య భార్గవ్ బాక్సింగ్‌లో మెరిశాడు. ఇటీవల హర్యానాలో జరిగిన 6వ జూనియర్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించాడు. ఈ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎస్.దేవివరప్రసాద్ త్రుటిలో పతకం కోల్పోయాడు. టోర్నీ ముగించుకుని జిల్లాకు తిరిగొచ్చిన క్రీడాకారులను, డీఎస్ఏ కోచ్ ఎం.ఉమామహేశ్వర రావును డీఎస్‌డీఓ డాక్టర్ కై.శ్రీధర్ గవరావు శనివారం అభినందించారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్ దేవ్, బలగ సీతారాం, వంగా మహేష్, సీనియర్ బాక్సర్లు హర్షం వ్యక్తం చేశారు.



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ శ్రీధర్, కోచ్ ఉమామహేష్

విక్రమదేవ్ వర్మకు ఘన నివాళి



'సిటీ ఆఫ్ విక్టరీ జయపుర' ఫొటో ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి



ప్రదర్శనలో ఫొటోలు తిలకిస్తున్న ఎం.ఎల్.ఎ తదితరులు

జయపురం: బహుముఖ ప్రజ్ఞాశాలి, ఉత్కళాంధ్ర వారధి జయపురం మహారాజు సామ్రాట్ విక్రమదేవ్ వర్మ అని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. విక్రమ దేవ్ వర్మ 157వ జయంతి ఉత్సవాల సందర్భంగా.. ఇంటాక్ కొరాపుట్ చాప్టర్ సహకారంతో స్థానిక శ్రీ విక్రమ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన 'సిటీ ఆఫ్ విక్టరీ జయపుర' ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విక్రమదేవ్ వర్మ ప్రత్యేక ఒడిశా ఉద్యమంలో చిరస్మరణీయ భూమిక నిర్వహించారని గుర్తు చేశారు. 'సిటీ ఆఫ్ విక్టరీ జయపుర' ఫొటో ప్రదర్శనను కౌన్సిల్ ఆఫ్ అనాలిటికల్ ట్రైబల్ స్టడీస్ కొరాపుట్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ పరేష్ రథ్ నిర్వహించారు.



దేశ ప్రథమ ప్రధాన మంత్రితో విక్రమదేవ్ వర్మ



జయపురం మహారాజు విక్రమదేవ్ అంబారీ ఏనుగు

క్లుప్తంగా

జూలై 1న జాతీయ వైద్యుల దినోత్సవం



వైద్యుల దినోత్సవం ఆహ్వానప్రతుల ఆవిష్కరణ

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ, సీతం ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా జూలై 1వ తేదీన జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నామని సీతం ఇంజినీరింగ్ కాలేజి డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు పేర్కొన్నారు. తోటపాలెం సత్య విద్యా సంస్థల వద్ద శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్యుల దినోత్సవం ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. వైద్యులు ప్రాణదాతలని, సమాజంలో వారి స్థానం ఎల్లప్పుడూ గౌరవప్రదంగానే ఉంటుందన్నారు. సాంకేతికంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలతో ప్రపంచం ముందుకు వెళ్తుందని ఈ నేపథ్యంలో విద్యార్థులకు వివిధ అంశాలపై జాతీయ వైద్యుల దినోత్సవం నాడు ప్రముఖ వైద్యులతో అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, సత్య డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి దేవమణి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఐదుగురు అరెస్టు



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ రమణ, ఎస్ఐ మహేష్

బొండపల్లి: మండలంలోని గొట్లాం బైపాస్ రోడ్డు మీదుగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని ఐదుగురు యువకులతో పాటు గంజాయిని సీజ్ చేసినట్టు సీఐ రమణ, ఎస్ఐ మహేష్ శనివారం తెలిపారు. కురుపాంకు చెందిన డి.కీర్తిరాజ్‌కుమార్, పి.అమర్, ఎం.అఖిల్, ఒడిశాకు చెందిన టి.రమేష్, ఇ.శ్యామ్‌లను అదుపులోకి తీసుకొని వారి నుంచి 1200 గ్రాముల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు.

గంజాయి పట్టివేత

రాజాం సిటీ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేశామని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం చీపురుపల్లి రోడ్డులోని గాయత్రి కాలనీ సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా 1.148 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని తెలిపారు. సీఐ వివరాలు మేరకు మెరకముడిదాం మండలం మర్రివలస గ్రామానికి చెందిన వలిరెడ్డి సత్యనారాయణ ద్విచక్ర వాహనంపై చీపురుపల్లి నుంచి రాజాం వైపు వస్తున్నాడు. వాహన తనిఖీలు చేస్తుండగా అతని వద్ద ఉన్న ప్యాకెట్‌ను పరిశీలించగా 1.148 కేజీల గంజాయిగా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామని అన్నారు. అంతేకాకుండా మల్లిఖార్జునకాలనీ గాయత్రిమఠం సమీపంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని అన్నారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

వేపాడ: మండలంలోని నల్లబిల్లి గ్రామానికి చెందిన ఈర్లి సీతారాం(65)పై అదే గ్రామానికి చెందిన ఉడతా మణికంఠ కత్తిపీటతో దాడి చేసి గాయపర్చిన సంగతి పాఠకులకు విదితమే. దీనిపై ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు పర్యవేక్షణలో ఎల్.కోట ఎస్ఐ నవీన్ పడాల్ శుక్రవారం రాత్రి సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. శనివారం దాడికి పాల్పడిన మణికంఠను అదుపులోకి తీసుకుని ఎల్.కోట ఎస్ఐ నవీన్ పడాల్ కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన నాల్గో వ్యక్తి అరెస్టు



నిందితుడు సత్యనారాయణ

విజయనగరం క్రైమ్ : ఉద్యోగాల పేరిట యువతను మోసం చేసిన కేసులో నాల్గో నిందితుడిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. 2022లో రైల్వే, డాక్‌యార్డులో ఉద్యోగాలిస్తామంటూ నలుగురు ముఠాగా ఏర్పడి నిరుద్యోగ యువత నుంచి డబ్బులు వసూలు చేశారు. అప్పట్లో అందిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ వెంకటరావు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో నాల్గో నిందితుడైన కొత్తవలసకు చెందిన కోసూరు శివ వెంకట సత్యనారాయణను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని సీఐ తెలిపారు. రూ.80వేలు రికవరీ చేసినట్టు తెలిపారు.

గురుకులంలో ఇంటర్ విద్యకు మంగళం

- నీట్, ఐఐటీ బ్యాచ్‌ల పేరుతో రెగ్యులర్ ఇంటర్‌ను ఎత్తేశారు
- మూడు దశాబ్దాలుగా కొనసాగిన తరగతులు జరగవిక
- ఎంపీసీ, బైపీసీ కోసం జిల్లా శివారు ప్రాంతాలకు పరుగులు
- ఆవేదనలో గ్రామీణ ప్రాంత ఎస్సీ, ఎస్టీ కుటుంబాల బాలికలు



చీపురుపల్లిలోని బీఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాల

చీపురుపల్లి: 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందట' అన్న చందంగా తయారైంది గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ పరిస్థితి. సాధారణంగా ప్రభుత్వాలు మారినప్పుడు గతంలో ఉన్న సౌకర్యాలు కంటే మరింత మెరుగైన సదుపాయాలు కల్పించడం చూస్తుంటాం. ప్రస్తుత కూటమి పాలనలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. దీనికి పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో మూడు దశాబ్దాలుగా ఉన్న రెగ్యులర్ ఇంటర్మీడియట్ కోర్సుకు మంగళం పాడడమే నిదర్శనం. చీపురుపల్లి గురుకుల బాలికల కళాశాలలో విద్యనభ్యసించేందుకు విద్యార్థినులు పోటీ పడేవారు. ఏటా ప్రవేశాల కోసం అధికమంది దరఖాస్తు చేసేవారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ కోర్సులు నిర్వహించడంలేదని తెలియడంతో గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన బాలికలు ఆవేదన చెందుతున్నారు. కళాశాల గేటుకు వేలాడుతున్న రెగ్యులర్ ఇంటర్ లేదన్న నోటీస్ బోర్డును చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. చీపురుపల్లి గురుకుల బాలికల కళాశాలను కేవలం నీట్, ఐఐటీ బ్యాచెస్‌కు కేటాయించారని, రెగ్యులర్ ఇంటర్ ఇక్కడ లేదని సిబ్బంది చెబుతున్నారు. నీట్, ఐఐటీ లాంటి ఉన్నత కోర్సులకు వెళ్లే విద్యార్థులు కోసం ప్రత్యేకంగా బ్యాచ్‌లు నడపడం మంచిదే అయినప్పటికీ, రెగ్యులర్ ఇంటర్ పూర్తిగా రద్దు చేయడం అన్యాయమని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జోనల్ స్థాయిలో ఒక నీట్, ఐఐటీ క్యాంపస్

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో ఒక నీట్, ఐఐటీ క్యాంపస్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి విజయనగరం, విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలకు సంబంధించి చీపురుపల్లి గురుకుల బాలికల కళాశాలలో ఆ క్యాంపస్‌ను ఏర్పాటు చేసి రెగ్యులర్ ఇంటర్‌ను రద్దు చేశారు. ఈ క్యాంపస్ గతంలో రాష్ట్ర వ్యాప్తంగా అమరావతిలో ఒక్కటే ఉండేది. తాజాగా జోనల్‌స్థాయిలో ఒక్కోటి ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో అది కూడా చీపురుపల్లిలో ఏర్పాటు చేయడంతో రెగ్యులర్ ఇంటర్‌కు మంగళం పాడేలా చేసింది. ఇక్కడ ఏర్పాటు చేసిన నీట్, ఐఐటీ క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ చదవాలనుకునే విద్యార్థులకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఎంట్రన్స్ కూడా నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేశారు.

మూడు దశాబ్దాల చరిత్ర..

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 1984లో చీపురుపల్లి కేంద్రంగా గురుకుల బాలికల పాఠశాలను ఏర్పాటుచేశారు. తరువాత కాలంలో 1994లో గురుకుల బాలికల కళాశాలను ఏర్పాటు చేసి ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులను తీసుకొచ్చారు. 31 సంవత్సరాలుగా ఉన్న ఇంటర్మీడియట్ కోర్సు ఇప్పుడిక లేదు. పక్కనే నెలిమర్లలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల ఉన్నప్పటికీ అక్కడ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు లేవు. దీంతో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు కావాలనుకునే చీపురుపల్లి, నెలిమర్ల, విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన పిల్లలు జిల్లాలోని సుదూరంగా ఉన్న వేపాడ, వియ్యంపేట వంటి గురుకుల కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది.



రెగ్యులర్ ఇంటర్మీడియట్ లేదని కళాశాల వద్ద పెట్టిన నోటీస్ బోర్డు

రెగ్యులర్ ఇంటర్మీడియట్ లేదు....

జోనల్ స్థాయిలో ఏర్పాటు చేసిన నీట్, ఐఐటీ క్యాంపస్‌ను చీపురుపల్లి గురుకుల కళాశాలలో ఏర్పాటు చేశారు. దీంతో రెగ్యులర్ ఇంటర్మీడియట్‌ను రద్దు చేసి ఇక్కడి సీట్లను ఇతర కళాశాలల్లో సర్దుబాటు చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన నీట్, ఐఐటీ బ్యాచ్‌కు సంబంధించి సీట్లు కూడా పూర్తయ్యాయి.

– రాణీశ్రీ, ప్రిన్సిపాల్, గురుకుల కళాశాల, చీపురుపల్లి

అరుదైన జువెనరీ గ్లకోమా చికిత్స

బొబ్బిలి: పట్టణంలోని బొబ్బిలి కంటి ఆసుపత్రిలో జాతీయ స్థాయి కంటి శస్త్రచికిత్సల నిపుణులు డాక్టర్ కేవీ అప్పారావు అరుదైన కంటి శస్త్ర చికిత్స నిర్వహించారు. పార్వతీపురానికి చెందిన నరేంద్ర పంగి అనే మహిళకు చిన్నతనంలోనే గ్లకోమా (జువెనరీ గ్లకోమా)వ్యాధి సోకింది. ఈమె విశాఖ తదితర ప్రాంతాల్లో పలు ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు పొందినా నయం కాలేదు. చూపు మరింత మందగించింది. చివరికి డాక్టర్ కేవీ అప్పారావు డాక్టర్‌ను కలసింది. ఆయన చికిత్స చేసి ఇది అరుదైన జువెనరి గ్లకోమా వ్యాధి అని శస్త్ర చికిత్స అవసరమని ఆ ప్రకారం చేయడంతో ఈమెకు కంటి చూపు 70శాతం పైగా వచ్చినట్టు తెలిపారు. అసలు నాకు కంటి చూపు వస్తుందని అనుకోలేదని, బొబ్బిలిలో చికిత్స చేయించుకోవడం వలన తాను మునుపటిలా చూడగలుగుతున్నానని డాక్టర్ అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ ఈమెకు 21 సంవత్సరాల వయసులోనే గ్లకోమా వచ్చిందన్నారు. ఇటువంటి వారికి వచ్చే అంధత్వాన్ని జువెనరీ గ్లకోమా వ్యాధి అంటారన్నారు. ఏమాత్రం దృష్టి లోపం ఉన్నా వెంటనే వైద్యుల్ని సంప్రదించాలన్నారు.



శస్త్ర చికిత్స చేయించుకున్న మహిళ కుటుంబంతో డాక్టర్ కేవీ అప్పారావు

1850కి పైగా కేసుల నమోదు

విజయనగరం టౌన్: రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలందించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రత్యేక కార్యాచరణ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో పూరి రథయాత్రకి వెళ్లి, వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై అధికారులు శనివారం విశాఖపట్టణం నుంచి విజయనగరం మీదుగా రైళ్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వెయిటింగ్ హాల్స్, క్యాటరింగ్ స్టాల్స్, ప్యాంట్రీకార్ల వద్ద ఆహార పదార్థాలను పరిశీలించారు. టికెట్ లేకుండా ప్రయాణాలు చేసే వారిపై దృష్టి సారించారు. 1850 మందికి పైగా టికెట్ లేకుండా ప్రయాణాలు చేస్తున్న వారిని గుర్తించి, వారి నుంచి రూ.11 లక్షలకు పైగా అపరాధ రుసుం వసూలు చేసినట్టు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ పేర్కొన్నారు. టికెట్ల కోసం సరైన క్యూలను నిర్వహించాలని, రైళ్లలో బోర్డింగ్ సులభతరం చేయాలని, క్యూఆర్ ఆధారిత కోడ్‌లతో డిజిటల్ చెల్లింపులను ఉపయోగించాలని, మండే వస్తువులను తీసుకువెళ్లవద్దని, టికెట్ తనిఖీ చేసినప్పుడు సరైన ఐడీ రుజువును చూపించాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.



టికెట్ లేని ప్రయాణాలు చేస్తున్న వారికి అపరాధ రుసుం విధిస్తున్న రైల్వే అధికారులు

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి



రైలు పట్టాల సమీపంలో మహిళ మృతదేహం

బాడంగి: మండలంలోని డొంకినవలస–బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య గొల్లాది మంగళ గేటు సమీపంలో రైలు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. బొబ్బిలి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో సుమారు 45ఏళ్ల వయస్సు కలిగిన మహిళను రైలు ఢీకొనడం లేదా జారిపడి పోవడం వల్ల మృతి చెంది ఉంటుందని రైల్వే హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు. మృతురాలి శరీరంపై ఎరుపు, పసుపు రంగుచీర కలిగి ఉందని, గుర్తు పట్టడానికి ఎటువంటి ఆనవాళ్లు లేవని చెప్పారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచామని తెలిపారు. వివరాలు తెలిసిన వారు ఆర్‌పీఎస్ఎస్ఐ 9490617089 నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పాముకాటుతో వృద్ధుడు..



పాముకాటుతో మృతి చెందిన తిరుపతిరావు (ఫైల్)

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఒప్పంగి గ్రామానికి చెందిన ఎప్పరిక తిరుపతిరావు(63) పాము కాటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తిరుపతిరావు గ్రామ సమీపంలో పశువుల శాల వద్ద పెంచుతున్న కోళ్లను కప్పేందుకు శుక్రవారం సాయంత్రం వెళ్లగా అక్కడ నాగుపాము కాటేసింది. తిరుపతిరావు ఆ పామును అక్కడే కొట్టి చంపేశాడు. ఇంటికొచ్చి కుటుంబీకులకు తెలియజేయగా వైద్యం నిమిత్తం భద్రగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే తిరుపతిరావు మృతి చెందినట్టు తెలిపారు. అనంతరం భద్రగిరి ఆసుపత్రి వద్ద పోస్టుమార్టం నిర్వహించి తిరుపతిరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఒక్క రోజు ఎస్ఐగా ఖాన్

- నలుగురు ఏఎస్ఐలకు పదోన్నతి

విజయనగరం క్రైమ్: విశాఖ పోలీస్ రేంజ్ పరిధిలో నలుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ విశాఖ పోలీస్ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో బి.సురేష్ పార్వతీపురం మన్యం జిల్లాకు, డి.సత్యారావును శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. మిగిలిన ఇద్దరు కె. శ్రీనివాసరావు, సర్దార్ ఖాన్‌లను విజయనగరం జిల్లాకు కేటాయించారు. ఎస్ఐగా పదోన్నతి పొందిన సర్దార్ ఖాన్ భోగాపురం ఏఎస్ఐగా పని చేస్తున్నారు. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయంలో ఆయన్ను సర్దార్ ఖాన్ కలిసి అభినందనలు తెలిపారు. కాగా, ఎస్ఐగా పదోన్నతి పొందిన సర్దార్ ఖాన్ ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. 1982లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరిన సర్దార్ ఖాన్ 2009లో ఏఎస్ఐగా, ఇప్పుడు ఎస్ఐగా పదోన్నతి పొందారు. సోమవారం రిటైర్ కానున్నారు.



డీఐజీ గోపినాథ్ జెట్టీని కలిసిన ఎస్ఐగా పదోన్నతి పొందిన సర్దార్ ఖాన్

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.6.70 లక్షల జరిమాన

విజయనగరం క్రైమ్ : డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 67 మంది వాహనదారులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున విజయనగరం అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎంఎస్‌హెచ్ఆర్ తేజ చక్రవర్తి విధించారని ఎస్పీ వకుల్ జిందల్ శనివారం తెలిపారు. విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు వీరిపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. వీరికి రూ.6.70 లక్షల జరిమాన విధించారని తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు శనివారం పయనమయ్యారు. ఈ నెల 29నుంచి విజయవాడలో గల డీఎస్సీ ఇండోర్ స్టేడియంలో అండర్ – 10, 12 వయస్సుల విభాగాల్లో జరగనున్న పోటీల్లో సైబర్, ఇప్పీ, ఫాయిల్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో జిల్లా నుంచి పడాల గణేష్, జాయ్ జబేజ్, టి.నరేంద్ర, హసీనా శ్రీవల్లి, మొహమ్మద్ షేక్ అహ్మద్ ప్రాతినిధ్యం వహించనున్నారు. క్రీడాకారులను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చీఫ్ కోచ్ డివి చారిప్రసాద్, సభ్యులు దాలిరాజు, పిల్లా శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు అభినందించారు.

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయ స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో విజయనగరం జిల్లాకు క్రీడాకారులు మొత్తం 6 పతకాలు సాధించారు. ఈ నెల 23 నుంచి 25 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారులు పాల్గొనగా.. ఆరుగురు క్రీడాకారులు పతకాలు సాధించటం విశేషం. పోటీల్లో షణ్ముఖ సిద్ధార్థ గోల్డ్ మెడల్, హర్షవర్ధన్ సిల్వర్ మెడల్, వైష్ణవి దేవి సిల్వర్ మెడల్, రోహిణి బ్రాంజ్ మెడల్, హర్షిని బ్రాంజ్ మెడల్, తరుణ్ బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నారు. అంతేకాకుండా అత్యధిక పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం దక్కించుకున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు దక్కించుకున్న జిల్లా క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు, యశస్విని, కోటేశ్వరరావు అభినందించారు.

విశ్రాంత డీఈఓపై దాడి కేసులో నిందితుడు అరెస్టు

విజయనగరం క్రైమ్ : విజయనగరం టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న విశ్రాంత డీఈవో అప్పలనాయుడుపై దాడి చేసిన నిందితుడ్ని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు... నగరంలోని పూల్‌బాగ్‌లో నివాసం ఉంటున్న అప్పలనాయుడు ఇంటికి ఈ నెల 26న సోలార్ ప్యానెల్ పని నిమిత్తం వంకర కృష్ణ వచ్చాడు. అంతకు ముందు ఈ నెల 24న కృష్ణ విశ్రాంత డీఈవో ఇంటికి వచ్చినపుడు ఇంట్లో మహిళల ఒంటిపై బంగారు ఆభరణాలు ఉండడం చూసి పక్కా పథకం రచించాడు. ఈ క్రమంలో 26న ఇంటికి వేట కొడవలిని సంచిలో పెట్టుకుని కృష్ణ వచ్చాడు. ఆ సమయంలో అప్పలనాయుడు ఫోన్ చూస్తుండగా ఒక్కసారిగా వెంట తెచ్చిన వేట కొడవలితో ఆయనపై దాడి చేశాడు. ఈ మేరకు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి భోగాపురానికి చెందిన కృష్ణను శనివారం అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ (వెనుక ముసుగులో నిందితుడు కృష్ణ)

కలెక్టర్ తీరుపై భగ్గుమన్న జిందాల్ నిర్వాసితులు



బొడ్డవరలో ఆందోళన వ్యక్తం చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

- మేలు చేయమంటే బెదిరించటం కాదు..

శృంగవరపుకోట: జిందాల్‌కు భూములిచ్చి నష్టపోయిన రైతాంగానికి మేలు చేయమంటే జిల్లాకు ఉన్నతాధికారి అయిన కలెక్టర్ నిర్వాసితులను బెదిరించడం ఎంత వరకు సమంజసమని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, నిర్వాసిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు జరుగుతున్న అన్యాయంపై జిందాల్ నిర్వాసితులు బొడ్డవరలో శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నిర్వాసితులు ఎవరో మభ్యపెడితే, ఆశ పెడితే ఆందోళనకు దిగారని చెప్పడం సరికాదన్నారు. నిర్వాసితులు తమకు జరుగుతున్న అన్యాయంపై పోరాడేందుకు మద్దతుగా ఉండాలని అన్ని పక్షాల వారిని కోరిన విషయం గుర్తించాలన్నారు. జిందాల్ తమకు ఇస్తామన్న ఉద్యోగం, పరిహారం, షేర్లు, ఇల్లు వంటి హామీలు ఎవరు తీరుస్తారు? ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఉపాధి కల్పిస్తామంటారే తప్ప, నిర్వాసిత కుటుంబాలకు ఉద్యోగం ఇస్తామని ఎందుకు చెప్పరని ప్రశ్నించారు. జిందాల్ ఇచ్చిన హామీలు తీర్చడంలో ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషిస్తామని ఎందుకు హామీ ఇవ్వరని నిలదీశారు. జిందాల్ భూముల్లో ఎవరికీ హక్కు లేదన్న కలెక్టర్ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటులో ఎందుకు ఉత్సాహం చూపుతున్నారని ప్రశ్నించారు. జిందాల్ నిర్వాసితుల సమస్యలపై తరువాత ఆలోచిద్దాం అన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులను ఏమనాలని ప్రశ్నించారు. కంపెనీల ఏర్పాటుకు నిర్వాసితులు వ్యతిరేకం కాదన్న విషయాన్ని కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు గుర్తించుకోవాలన్నారు. నిర్వాసితులను బెదిరించాలనుకోవడం సరికాదని, అధికారులు, ప్రజాప్రతినిధులను జిందాల్ తప్పుదోవ పట్టిస్తుందన్న విషయం తెలుసుకోవాలని సూచించారు. పెద్ద సంఖ్యలో నిర్వాసితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్‌పై వెళ్తున్న లారీ, బైక్‌లు ఢీకొనడంతో (రెండూ ఒకే వైపు)మండలంలోని శివడవలసకు చెందిన గణేష్ అనే యువకుడి కాలు నుజ్జు నుజ్జయింది. లారీని ఓవర్ టేక్ చేస్తుండగా ముందు చక్రం కింద పడటంతో తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలో చాలా సేపు ఉండిపోయాడు. అంబులెన్స్ రాక ఆలస్యం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్షతగాత్రుడ్ని ట్రాఫిక్ ఎస్ఐ పి.జ్ఞానప్రసాద్ సిబ్బంది జ్ఞానప్రసాద్ సిబ్బంది, ఇతరుల సాయంతో ఆటోలో ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



క్షతగాత్రుడ్ని తరలిస్తున్న ఎస్ఐ జ్ఞానప్రసాద్ తదితరులు

వైద్య కళాశాలకు చంపావతి నది నీరు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాలకు మొయిద వద్ద చంపావతి నదిలో రూ.12 కోట్ల తో ప్రతిపాదించిన తాగునీటి సరఫరా పథకం నిర్మాణ పనులను 10 రోజుల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజుకి 1 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసేలా పథకం పనులు పూర్తిచేయాలన్నారు. మరో ఏడాది తరువాత వైద్య కళాశాలలో పీజీ తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, విద్యార్థుల సంఖ్య మరింత పెరగనుందన్నారు. ప్రస్తుతం కళాశాలలో అందుబాటులో ఉన్న ఆరు బోరు బావుల్లో నీరు పునరుద్ధరణ అయ్యేందుకు వీలుగా నీటి సేకరణ కట్టడాలను, నీటిని నిల్వ ఉంచేందుకు సంప్ ట్యాంకును వారం రోజుల్లో నిర్మించాలన్నారు. నీటి అవసరాలను తీర్చేందుకు తా త్కాలికంగా వారం రోజులపాటు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. జీఎస్‌టీయూ కూడలి నుంచి వైద్యకళాశాల వరకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.పద్మలీల, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డీపీఓ మల్లికార్జునరావు, భూగర్భ జలశాఖ డిడి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్

అనాథ పిల్లల జాబితా పునఃపరిశీలించాలి

మిషన్ వాత్సల్య పథకం కింద అనాథ పిల్లలకు అందిస్తున్న ఆర్థిక సహాయం కోసం వచ్చిన 22 దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను శనివారం ఆదేశించారు. జిల్లాలో కోవిడ్ ప్రభావిత, అనాథ, హెచ్ఐవీ ప్రభావిత 388 మంది పిల్లలకు నెలకు రూ.4,000లు అందజేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో డీసీపీయూ లక్ష్మి, బి.రామకోటి పాల్గొన్నారు.

మడ్డువలసలో ఏనుగుల విధ్వంసం



మడ్డువలసలో ఏనుగుల గుంపు

వంగర: మండల పరిధి మడ్డువలస గ్రామంలో ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించింది. రెండు రోజులుగా ఇక్కడ సంచరిస్తున్న ఏనుగులు గ్రామానికి చెందిన బూరాడ విష్ణు, దత్తి వెంకటనాయుడు, బూరాడ నాయుడు, తివనాన సుబ్బినాయుడు, బూరాడ కృష్ణ, నరసయ్యల వరినారు మడులను ధ్వంసం చేశాయి. ఉభాలకోసం సిద్ధం చేస్తున్న నారుమడులను నాశనం చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. అలాగే బూరాడ వెంకటరావుకు చెందిన ధాన్యం బస్తాలు, గొడౌన్‌ను ఏనుగులు ధ్వంసం చేయగా, తివనాన సుబ్బినాయుడు ధాన్యం బస్తాలను చెల్లాచెదురు చేశాయి. అనంతరం ఈ గుంపు మడ్డువలస సమీపంలో ఉన్న రేగిడి మండల సరసనాపల్లి తోటలోకి ప్రవేశించాయి.

జర్నలిస్టుల నిరసన ప్రదర్శన

- మీడియా సంస్థలపై దాడులను ఖండించిన పాత్రికేయులు
- విజయనగరం కోట నుంచి మూడులాంతర్ల కూడలి వరకు నిరసన ర్యాలీ

విజయనగరం క్రైమ్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలపక్షాన నిలిచే పత్రికలు, మీడియా, జర్నలిస్టులపై దాడులను మీడియా ప్రతినిధులు ముక్తకంఠంతో ఖండించారు. హైదరాబాద్‌లో మహాటీవీ ఆఫీస్‌పై దాడికి నిరసనగా విజయనగరంలోని కోట కూడలి నుంచి గురజాడ అప్పారావు రోడ్డు మీదుగా మూడులాంతర్లు కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అక్కడ జర్నలిస్టు సంఘాల నాయకులు శివప్రసాద్, ఎంఎంఎల్ నాయుడు, కోటేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ రాజకీయ నాయకులు, పోలీసులు తరచూ జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతుండడం విచారకరమన్నారు. హైదరాబాద్‌లోని మహాటీవీ, విజయనగరంలో ఎన్‌టీవీ జిల్లా రిపోర్టర్‌పై దాడులు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. టూటౌన్ ఎస్ఐ తీరుపై ఏఎస్పీ సౌమ్యలతకు ఫిర్యాదు చేశామని, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ఆధునిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటూ ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్న మీడియా ప్రతినిధిపై ఎస్ఐ దాడిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో జర్నలిస్టు ప్రతినిధులు భానుప్రసాద్, బూరాడ శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీధర్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మీడియాపై దాడులకు నిరసనగా విజయనగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మీడియా ప్రతినిధులు